క్లుప్తంగా

31వ తేదీనే పెన్షన్ల పంపిణీ

సంతనూతలపాడు: జూన్ నెల ఒకటో తేదీ ఆదివారం సందర్భంగా ఈ నెల 31వ తేదీ శనివారం నుంచే సచివాలయ సిబ్బందిచే ఇంటింటా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేయనున్నామని ఎండీవో డీ సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా 30వ తేదీన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని ఆయా బ్యాంకుల్లో నగదును డ్రా చేసుకోవాలని ఆయన వారిని ఆదేశించారు. మండలంలో 6643 ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లకు గాను రూ.2.85 కోట్లు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉల్లాసంగా వేసవి శిక్షణ తరగతులు


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నాగులుప్పలపాడు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయంలో గురువారం ఉల్లాసంగా సాగాయి. ఈసందర్భంగా తెలగతోటి సామ్యూల్ 'టీ' మీద పదాలు వివరించారు. పదాల అర్థాలను వివరిస్తూ నవ్విస్తూ బోధించండతో విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. ఎత్తు బరువు ఆధారంగా ఆరోగ్యం ఎలా ఉంటుందని విషయం గురించి వివరించారు. అమరా మానస లక్ష్మీప్రియ విద్యార్థులకు చిన్న పేపర్ సాయంతో క్విజ్ నిర్వహించారు. చిన్నచిన్న నీతి కథల గురించి చెప్పారు. అనంతరం వివిధ రకాల ఆటలు ఆడించారు. శిక్షణా తరగతులకు 16 మంది విద్యార్థులు హాజరయ్యారని లైబ్రేరియన్ ప్రసాద్ తెలిపారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

సంతనూతలపాడు: ఉపాధి పనుల్లో సిబ్బంది వేగవంతం చేయాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొనారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టార్గెట్ ప్రకారం కూలీలందరూ పనులకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఫారం పాండ్స్ పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పండ్ల తోటలు పెంపకంపై రైతులను ప్రోత్సహించాలన్నారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం వచ్చేలా కొలతలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వాసంతి, హార్టికల్చరల్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష

ఒంగోలు: దాడి కేసులో నిందితుడిపై నేరం నిరూపణ కావడంతో 6 నెలల జైలుశిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.హేమలత గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. టంగుటూరు మండలం కారుమంచికి చెందిన మేడికొండ రామస్వామి, మేడికొండ రాంబాబుకు మధ్య వివాదం నెలకొంది. 2018 డిసెంబర్ 12వ తేదీ సాయంత్రం 6.20 గంటలకు రామస్వామి తన బైకుపై ఒంగోలు దక్షిణ బైపాస్‌కు వచ్చాడు. అదే సమయంలో అక్కడ ఉన్న రాంబాబు ఇనుపరాడ్డుతో దాడి చేశాడు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ రామస్వామి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. విచారణలో లభించిన సాక్ష్యాల ఆధారంగా హత్యాయత్నం కేసుగా మార్చారు. తుది విచారణ అనంతరం నిందితుడికి 6 నెలల జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. జరిమానా మొత్తంలో రూ.10 వేలు బాధితుడికి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

పంట ఉత్పత్తుల పెంపుదలకు కృషి

పొదిలి రూరల్: వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకే వికసిత్ కృషి సంకల్ప అభియాన్ నిర్వహిస్తున్నట్లు దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తూము వెంకటేశ్వరరెడ్డి, ప్రద్యుమ్నయాదవ్ పేర్కొన్నారు. గురువారం పొదిలి మండలం ఆముదాలపల్లిలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ సంయుక్తంగా వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు మట్టి పరీక్షలు చేయించుకుని ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు. అంతేగాకుండా నూనె గింజల సాగు పెంచాలని సూచించారు. కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు తీసుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఉద్యానవన పంటలైన బొప్పాయి, దానిమ్మ సాగుతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. వ్యవసాయంలో డ్రోన్ వినియోగంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ విజయనిర్మల, ప్రకృతి వ్యవసాయం డీపీఎం సుభాషిణి, ఏపీ సీడ్స్ ఒంగోలు మేనేజర్ బుచ్చమ్మ, ఏఓ షేక్ జైనలాబ్దిన్, ఉద్యానవన అధికారి డి.సంధ్య, జిల్లా వనరుల కేంద్రం ఏఓ శేషమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ నర్మద, రైతులు పాల్గొన్నారు.

బండ బాదుడు.. బతుకులు భారం!

- పేద ప్రజలపై గ్యాస్ ధరల భారం
- సిలిండర్‌పై అదనంగా రూ.50 పెంపు
- భగ్గుమంటున్న ప్రజానీకం
- జీవనం కష్టంగా ఉందంటున్న కుటుంబాలు


వినియోగదారులకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్న సిలిండర్ల ఆటో (ఫైల్)

చీమకుర్తిరూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సామన్య జనం కష్టాలు రెట్టింపయ్యాయి. రోజుకో పేరు మీద అదనపు భారం వేస్తూ ముక్కు పిండి వసూలు చేస్తోంది. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు జీవనం గడపాలంటే బెంబేలిత్తిపోతున్నారు. అధికారంలోకి వస్తే మీ కరెంటు చార్జీలు పెంచము.. అన్నారు. తీరా వచ్చాక చూస్తే ట్రూఅప్ పేరుతో బాదేశారు. ఉచిత ఇసుక అన్నారు.. ఇసుక క్వారీ దగ్గరకు వస్తే టన్ను రూ.25 వేలే అని వసూలు చేశారు. నిత్యావసరాలు అయితే చెప్పనక్కర్లేదు. అన్నీ పెరిగిపోయాయి. పెట్రోలు, డీజిల్ ఇలా ఒకటి మిటి తెలిసిన వస్తులన్నీ పెంచేశారు. ఆ కోవలోకి చెందినదే గ్యాస్ కూడాను. దీని మీద రూ. 50 అదనంగా పెంచి చేతులు దులుపుకుంది కూటమి ప్రభుత్వం. సామాన్య మధ్య తరగతి కుటుంబాల వంటింట్లో కూటమి ప్రభుత్వం మళ్లీ మంట పెట్టింది. కొన్ని రోజులుగా వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుకుంటూ వస్తున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగదారులకు వాత పెట్టింది. పేద, సామాన్య కుటుంబాలకు గ్యాస్ ధర గుదిబండగా మారింది. ఇప్పటికే విద్యుత్ ధరల పెంపు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సామాన్యుడిపై మరో భారం పడింది. గృహ వినియోగ సిలిండర్ ధర రూ. 870 ఉండగా, తాజాగా కేంద్రం మరో రూ.50 పెంచి 930 చేసింది. దీంతో పేద వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

15 రోజులకోసారి సమీక్ష అంటా.. !

చీమకుర్తి మండలంలో 21847 హెచ్‌పీ గ్యాస్ కలెక్షన్లు ఉన్నాయి. హెచ్‌పీ గ్యాస్ కంపెనీకు చెందిన ఏజెన్సీకి సంబంధించి గ్యాస్ కనెక్షన్లు, జనరల్ గ్యాస్ కనెక్షన్లు 15716, దీపం గ్యాస్ కనెక్షన్లు 5665, ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లు 305, ప్రభుత్వ హాస్టల్లో అంగన్‌వాడీ కనెక్షన్లు 161 కలవు. సంతనూతలపాడు మండలంలో హెచ్‌పి, ఇండెన్ గ్యాస్ ఏజెన్సీల ద్వారా సుమారుగా 18 వేల గ్యాస్ కలెక్షన్లు ఉన్నాయి. సగటున ఒక కుటుంబానికి ఏడాదికి ఆరు నుంచి పది సిలిండర్ల వరకు వినియోగిస్తుంటారు. ఈ లెక్కన ప్రతి కుటుంబానికి ఏడాదికి సుమారు రూ. 500 వరకు అదనపు భారం పడుతుంది. ఈ ధరల పెంపుతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. ఉజ్వల పథకం లబ్ధిదారులపై కూడా ప్రభుత్వం కనికరం చూపలేదు. వారికి కూడా ఈ పెంపు వర్తింపజేసింది. ఇకపై ప్రతీ 15 రోజులకు లేదా నెలకు ఒకసారి ధరలపై సమీక్షిస్తామని ప్రకటించడంతో భవిష్యత్‌లో గ్యాస్ ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయనే సంకేతాలు ఇచ్చినట్లు ఉందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

పేదలపై అదనపు భారం..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు బిల్లులు, నిత్యవసరాల ధరలు తగ్గిస్తామని చెప్పిన నాయకులు అధికారంలో వచ్చిన వెంటనే ట్రూ అప్ చార్జీల పేరిట ఇష్టానుసారంగా బిల్లులు పెంచేశారు. అదే సమయంలో ఎన్నికలకు ముందు గ్యాస్ ధరలను స్వలంగా తగ్గించిన కేంద్ర ప్రభుత్వం ఆ తర్వాత పెంచడంతో పేదలపై అదనపు భారం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం తీరుపై వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– **సోము చౌదారెడ్డి**, మండల వలంటీర్ విభాగం అధ్యక్షుడు,చీమకుర్తి

గ్యాస్ ధరలతో పెనుభారం



సామాన్యులపై ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్ చార్జీలతో పాటు అనేక భారాలు మోపింది. డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా విపరీతంగా పెరగడానికి కారణమయ్యాయి. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇలా ధరలు పెంచి సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై భారం మోపుతోంది.

– **చీదర్ల శేషు**, మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు, చీమకుర్తి

పెంచిన ధరలను తగ్గించాలి..



ఎన్నికలకు ముందు ధరలు తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని రకాల ధరల పెంపుతో పేద ప్రజల నడ్డి విరిచింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధి లేక ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పటికే కరెంటు చార్జీలు పెంచడం, కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడంతో అదనపు భారంగా మారింది. ప్రభుత్వం తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలి.

– **నల్లూరి రామచంద్రారావు**, రైతు విభాగం అధ్యక్షుడు, చీమకుర్తి

రేషన్‌షాపును తనిఖీ చేసిన తహశీల్దార్


రేషన్ షాపును పరిశీలిస్తున్న తహశీల్దార్ నారాయణరెడ్డితో ఆర్‌ఐ రమణయ్య

మద్దిపాడు: మండలంలోని ఏడుగుండ్లపాడు రేషన్ షాపును తహశీల్దార్ నారాయణరెడ్డి గురువారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్‌కు సంబంధించిన పలు రికార్డుల తనిఖీ చేశారు. స్టాక్ ను పరిశీలించారు. రేషన్ షాపును పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆయన డీలర్‌ను ఆదేశించారు. రేషన్‌కు సంబంధించి ఎటువంటి అవకతవకలు జరగడానికి వీలు లేదన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ రేషన్ షాపులో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ తీసి ఉంచాలన్నారు. అదేవిధంగా వృద్ధులకు దివ్యాంగులకు మధ్యాహ్న సమయంలో రేషన్‌ను వారి ఇండ్లకు తీసుకు వెళ్లి ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్‌ఐ రమణయ్య, వీఆర్‌ఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాలపై అధికారుల కర్కశత్వం

- నీటి తొట్టెల్లో నీరు నింపని వైనం


చర్చి సెంటర్‌లో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలో నిల్వ ఉన్న మురుగునీరు

ఒంగోలు వన్‌టౌన్: మూగ జీవాలపై అధికారులు కర్కశత్వం ప్రదర్శిస్తున్నారు. నగరంలోని రోడ్లపై సంచారం చేస్తున్న ఆవులు, బర్రెలు, కుక్కలు ఇతర పశువులు ఎండా కాలంలో ఎండ వేడికి తాగు నీటికి ఇబ్బంది పడకుండా అక్కడక్కడ మున్సిపల్ అధికారులు నగరంలో నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. లక్షల ఖర్చు వెచ్చించి నీటి తొట్టెలను అయితే ఏర్పాటు చేశారు కాని వాటిలో నీటిని మాత్రం నింపడం లేదు. దీంతో ఆ తొట్టెల్లో వర్షపు నీరు నిల్వ ఉండి పశువులు కుడా తాగడానికి పనికి రాకుండా పోయాయి. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. సుందరీకరణ పేరుతో పాత మొక్కలను తీసి కొత్త మొక్కలను నాటి వాటికి మాత్రం రోజు నీటిని పెడుతున్నారే కాని పశువుల నీటి తొట్టెలలో మాత్రం నీరు పోయకుండా వివక్ష చూపుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి నీటి తొట్టెలలో నీరు నింపాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

లోదుక్కులు దున్నుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

దొనకొండ: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, వాతావరణం అనుకూలంగా ఉందని, గ్రామాల్లోని రైతులు పొలాలను లోదుక్కులు దున్నుకుని భూమి నుంచి ఆశించే వేరు కుళ్లు, తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఆరవల్లిపాడు, తెల్లబాడు గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రీ ఖరీఫ్‌పై కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ ఆధ్వర్యంలో రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి చేయూతగా అందించే వివిధ రకాల పథకాల గురించి రైతులకు వివరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, వాతావరణంలో మార్పులు వచ్చాయని, రైతులు విత్తనాలు విత్తుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లోని రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖను సంప్రదించి సూచనలు, సలహాలు పొందాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త రమేష్ మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో ఆరవల్లిపాడు, తెల్లబాడు గ్రామాలకు అనువైన పంటల రకాలు, వాటి గుణగణాలను వివరించారు. పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ షణ్ముగం మాట్లాడుతూ కోళ్ల పెంపకం, మేకలు, పశువులు పెంపకాల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు తెలిపారు. కేవీవికే నోడల్ అధికారి కె.సంధ్యారాణి, వీసీఎస్ నారాయణ, రమేష్‌దాస్, వివిధ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం


యోగా చేస్తున్న కార్యాలయ సిబ్బంది

నాగులుప్పలపాడు: ప్రతి రోజూ యోగాసనాలు వేయడం వలన మానసిక ఒత్తిడి దూరం అవుతుందని ఎంపీడీవో వై మహాలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా యోగా మాస్టర్ కే శంకరరావు వివిధ రకాల యోగాసనాలు వాటి వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం పలువురిచే యోగసనాలు వేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మురళీమోహన్, సూపరిండెంటెంట్ దక్షిణామూర్తి, కార్యదర్శులు, అధికారులు సిబ్బంది ఉన్నారు.

యోగాతో ఆరోగ్య సంరక్షణ..

సంతనూతలపాడు: యోగా ద్వారా మానసిక, శారీరక, ఆరోగ్య సంరక్షణ వస్తుందని డిప్యూటీ ఎంపీడీవో ఎం.రమణమ్మ ప్రసంగంలో పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాల్లో భాగంగా గురువారం మూడో రోజు జరుగుతున్న మండలస్థాయి యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభమైన శిక్షణ తరగతులు 31వ తేదీ వరకు జరగనున్నాయి. యోగా ద్వారా వ్యక్తిగత జీవితం దేశ అభివృద్ధికి దోహదపడగలదని రిసోర్స్ పర్సన్ ఆత్రేయ వెల్లడించారు. మండల స్థాయిలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు యోగా శిక్షణా తరగతుల్లో పాల్గొని వివిధ యోగ ప్రదర్శనలు చేశారు. శిక్షకులు వారి గ్రామ కేంద్రాల్లో ప్రజలను యోగా ద్వారా చైతన్యపరచాలని మండల డిప్యూటీ ఎంపీడీవో రమణమ్మ ఈ సందర్భంగా కోరారు.

50 మందికి కంటి ఆపరేషన్లు

కురిచేడు: ఉచితంగా కంటి శుక్లాల ఆపరేషన్ కోసం శంకర కంటి ఆస్పత్రికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గురువారం 50 మందిని తరలించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ ఆస్పత్రి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రవితేజ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారులు బీజేఎస్ హెరాల్డ్, ఏ.గురుస్వామి, శౌరీలు, తిరుపతిస్వామి, రమేష్, జాన్ పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో భక్తుల పూజలు



పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్లలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. దాతల సాయంతో ఆలయ ప్రాంగణంలో స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు


పొలంలో ఒకవైపు ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభాలు

పుల్లలచెరువు: మండలంలోని కవలకుంట్ల పొలాల వద్ద రెండు విద్యుత్ స్తంభాలు పూర్తిగా ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం ఈ రహదారి వెంట అధికారులు ప్రయాణిస్తున్నా వారికి కనిపించక పోవడం దారుణం. ప్రస్తుతం వర్షాలు, గాలులు వీస్తున్న తరుణంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే తీవ్రంగా నష్టం జరగడం ఖాయం. ఈ రెండు స్తంభాలు ఒరిగి ఉన్న పొలాలు యర్రగొండపాలెం, పుల్లలచెరువు ప్రధాన రహదారి పక్కనే ఉన్నాయి. అనుకోని ప్రమాదం జరిగితే నష్టం బాగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాలను మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

కౌలుకార్డుల జారీపై సిబ్బందికి అవగాహన


మాట్లాడుతున్న ఏవో ఫరూక్

ముండ్లమూరు (కురిచేడు): ఈ ఏడాదికి కౌలుకార్డుల జారీపై గ్రామస్థాయి సిబ్బందికి మండల కేంద్రం ముండ్లమూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అవగాహన కల్పించారు. వీఆర్వోలు, రైతు సేవాకేంద్రం సిబ్బందికి 2025–26 సంవత్సరానికి కార్డులు జారీ చేసే అంశంపై తహసీల్దార్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విధి విధానాలను మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ తెలిపారు. మండలానికి ఈ ఏడాదికి 1331 కౌలు కార్డులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. గ్రామస్థాయిలో వాస్తవ సాగుదారుల వివరాలను రైతు సేవా కేంద్రం సిబ్బంది సేకరించి గ్రామ రెవెన్యూ అధికారికి అందజేయాలని సూచించారు. ప్రతి రెవెన్యూ గ్రామ పరిధిలో వీఆర్వో, రైతు సేవా కేంద్రం సిబ్బంది ముందుగా గ్రామ నాయకులు, రైతులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసి సమావేశం నిర్వహించాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు ముందస్తుగానే ప్రతి వాస్తవ సాగుదారుడు గ్రామస్థాయి రైతు సేవా కేంద్రం సిబ్బందిని, లేదా వీఆర్వోని సంప్రదించి కౌలు కార్డులు పొందాలని తెలిపారు. కేవలం సాగుదారు హక్కు పత్రాలు ఉన్న కౌలురైతులకు మాత్రమే వివిధ ప్రభుత్వ పథకాలైన ఈ పంటనమోదు, అన్నదాత సుఖీభవ, విత్తనాల పంపిణీ, సూక్ష్మపోషకాలు రాయితీ రూపంలో రానున్న రోజుల్లో అందుతాయని వివరించారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీఎం నంబర్ ఆధారంగా కౌలుకార్డులు జారీ చేయాలని తెలిపారు. జూన్ నెల చివరి వారంలోపు గ్రామంలోని ప్రతి కౌలుదారుని పంట సాగుదారు హక్కు పత్రం జారీ చేయాలని ఆదేశించారు.

డివైడర్లపై చెత్త వేస్తే జరిమానా

యర్రగొండపాలెం: స్థానిక పంచాయతీ పరిధిలోని డివైడర్లపై చెత్త వేస్తే జరిమానా విధించాల్సి ఉంటుందని సర్పంచ్ రమావత్ అరుణాబాయి హెచ్చరించారు. గురువారం ఆమె మాచర్ల–మార్కాపురం రోడ్డులో ఉన్న డివైడర్లను శుభ్రం చేయించారు. డివైడర్లకు రెండు వైపులా ఉన్న వ్యాపారులు దుకాణాలు మూసే సమయంలో చెత్త తీసుకొచ్చి డివైడర్లపై పడేస్తున్నారు. పంచాయతీ కార్మికులు ఉదయం, సాయంత్రం చెత్తను ఎత్తేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. దీంతో పట్టణం అపరిశుభ్రంగా ఉండటంతో పాటు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. ఈ మేరకు సర్పంచ్ చర్యలు తీసుకోవడంతో పాటు డివైడర్లపై, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసిన వారిని గుర్తించి వారికి రూ. వెయ్యి జరిమానా విధిస్తామని ఆమె స్పష్టం చేశారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు


అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సంజీవరావు

తాళ్లూరు: నిత్యావసరాలను పరిశుభ్రమైన గదుల్లో ఉంచాలని, రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సంజీవరావు హెచ్చరించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ సరుకుల పంపిణీపై రేషన్ డీలర్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ సరుకుల పంపిణీని జూన్ 1 నుంచి షాపుల ద్వారా పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటిస్తూ రేషన్ సరుకులు ప్రజలకు అందించాలని, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. డీటీ ఇమ్మానియేల్ రాజ్ మాట్లాడుతూ రేషన్ షాపులు నిర్ణీత సమయం పాటిస్తూ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నిర్వహించాలని, రేషన్ సరుకుల పంపిణీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు ప్రజలకు అందించాలన్నారు. వీఆర్‌ఓలు, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు సాగర్ జలాలు


సాగర్ జలాల పంపింగ్

దొనకొండ: మండలంలోని చందవరం వద్ద ఏర్పాటు చేసిన సమ్మర్ స్టోరేజీ–1, 2లకు సాగర్ జలాలు అధికారులు విద్యుత్ మోటార్లతో పంపింగ్ చేస్తున్నారు. మండలంలోని 29 గ్రామాలకు నీరు సరఫరా చేసే చందవరం–1 స్టోరేజీకి 70 శాతం నీటితో ఉందని, నూరు శాతం నింపేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు. కొనకనమిట్ల, హెచ్‌ఎంపాడు, పొదిలి మండలాల్లోని 127 గ్రామాలకు సరఫరా జరిగే చందవరం–2 స్టోరేజీలో 60 శాతం నీరు ఉందని, వారం రోజుల పాటు సాగర్ జలాలు కాలువల ద్వారా సరఫరా అవుతున్నాయని, నూరు శాతం నింపేందుకు తమ సిబ్బంది మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 3 నెలల పాటు గ్రామాల్లోని ప్రజలకు సాగర్ నీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందని ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు.